కెరియర్‌కు పవర్.. బీఐ!

ప్రస్తుతం ప్రపంచంలో జరిగే వ్యాపారాల్లో గుట్టలుగుట్టలుగా వచ్చే డేటాను ఓ పద్ధతి ప్రకారం నిర్వహించడం, దాన్నుంచి అవసరమైన సమాచారాన్ని రాబట్టడం అంత సులువైన పని కాదు. ఆధునిక వ్యాపారంలో డేటా అనేది ఆలోచనల భాండాగారం. దాన్ని ఎంత సమర్థంగా ఉపయోగించుకుంటే అంతగా సత్ఫలితాలు పొందవచ్చు. అందుకే డేటా టూల్స్ వినియోగం పెరుగుతోంది.

ఇంటర్నెట్ యుగంలో డేటాకు ఉన్న ప్రాధాన్యం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సమస్త రంగాల్లోనూ, అన్ని వ్యాపారాల్లోనూ సమాచారం ఎంతో ముఖ్యమైనది, భవిష్యత్తు నిర్ణయాలను నిర్దేశించేది. అందుకే దీన్ని నిర్వహించే టూల్స్‌కు, వాటిని ఉపయోగించగలిగే ఉద్యోగులకు గిరాకీ పెరుగుతోంది. మైక్రోసాఫ్ట్ పవర్ బీఐ ఇటువంటి శక్తిమంతమైన టూల్ మాత్రమే కాదు, కెరియర్‌కూ పవర్‌ను ఇచ్చే స్కిల్! మరి దీని సంగతులేంటో ఇంకా చూద్దామా!

అంటే..?

పవర్ బీఐ మైక్రోసాఫ్ట్ సంస్థ అభివృద్ధి చేసిన ఒక బిజినెస్ ఇంటెలిజెన్స్ టూల్. ఇది బిజినెస్ అనలిటిక్స్, డేటా విజువలైజేషన్ అనే అంశాల ఆధారంగా పనిచేస్తుంది. వినియోగదారులకు అత్యంత అనుకూలమైన ఇంటర్‌ఫేస్ కలిగి ఉండి, సమాచార అనుసంధానం (డేటా ఇంటిగ్రేషన్)కు అవకాశం కల్పిస్తుంది. ఇది రియల్‌టైమ్ డేటా ప్రాసెసింగ్‌కు అనుకూలం కావడంతో మారుతున్న వివరాలను ఎప్పటికప్పుడు తాజాగా చూసే వీలుంటుంది.

▲ వివిధ రకాలైన మార్గాల ద్వారా డేటాను సేకరించడం, దాన్ని నిర్వహించడం, విశ్లేషించడం.. ఇవన్నీ అవలీలగా చేయగలుగుతుంది. పవర్ బీఐ క్లౌడ్ బేస్డ్ ప్లాట్‌ఫామ్. విభిన్నమైన డేటా సోర్సులకు సులభంగా అనుసంధానం కాగలదు. బేసిక్ ఎక్సెల్ స్ప్రెడ్ షీట్స్, డేటాబేస్, యాప్స్‌తో కలిసి పనిచేయగలదు. ఇది తొలుత డేటా మొత్తాన్ని ఒకచోటకి తీసుకొస్తుంది. దాన్ని చూడటానికి అనుకూలమైన గ్రాఫ్‌లు, చార్టుల రూపంలో విశ్లేషిస్తుంది. ఉపయోగకరమైన ఇన్‌సైట్స్‌ను తయారుచేస్తుంది. దీన్ని వినియోగదారులు తమ వ్యాపార అవసరాలకు ఉపయోగించుకోవచ్చు.

▲ ఇది మైక్రోసాఫ్ట్ ఎక్సెల్ ఆధారంగా తయారైనది. పవర్‌బీఐ అనే పదాన్ని విస్తృతమైన అర్థంలో వాడుతున్నారు. విండోస్ డెస్క్‌టాప్ అప్లికేషన్, ఆన్లైన్ ఎస్ఏఏఎస్ (సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్), విండోస్ ఫోన్స్, లాప్‌టాప్స్‌లో ఉండే యాప్స్, ఐఓఎస్, యాండ్రాయిడ్ డివైజ్‌లలో వాడే అప్లికేషన్లు అన్నీ ఇదే కోవలోకి వస్తాయి.

ఏం చేస్తుంది?

వ్యాపార సంస్థలు డేటాను ఆర్గనైజ్ చేసి ఉపయోగించుకుంటే తప్ప ఆలోచనలుగా మార్చుకోవడానికి వీలుండదు. ఇక్కడే పవర్ బీఐ చక్కగా ఉపయోగపడుతుంది. కంపెనీ డేటా ఆధారంగా నివేదికలు తయారుచేయడం, ఇన్‌సైట్స్ ఇవ్వడం, జరుగుతున్న మార్పులను గుర్తించడం.. ఇలా ఎన్నో చేస్తుంది. విభిన్న రకాలైన సోర్సులకు అనుసంధానమవుతూ.. తనకు ఇచ్చిన సమాచారానికి - కమాండ్‌కు పరిమితమై ఉంటుంది, అందువల్ల ఉపయోగించడం తేలిక. దీని ద్వారా తయారుచేసిన నివేదికలు, విశ్లేషణలను ఇతర వినియోగదారులు, అప్లికేషన్లతో పంచుకోవచ్చు.

▲ పవర్ బీఐ గతంలోనూ వర్తమానంలో ఏం జరిగింది అనేదే కాదు.. భవిష్యత్తులో ఏం జరుగుతుందో అంచనాలు సైతం చూపించగలుగుతుంది. ఎందుకంటే ఈ టెక్నాలజీ మెషీన్ లెర్నింగ్‌తో మిళితమై పనిచేస్తుంది, దాని ఆధారంగా ఈ వివరాలను అంచనా వేయగలదు.

▲ దీన్ని హెల్త్‌కేర్, ఫైనాన్స్, రిటైల్, మాన్యుఫాక్చరింగ్.. వంటి అనేక రంగాల్లో ఉపయోగిస్తున్నారు. అడోబ్, కేమమిని, డెల్, నెస్లే.. వంటి చాలా కంపెనీలు పవర్ బీఐని వినియోగిస్తున్నాయి.

ఎందుకు?: ఎక్సెల్‌ను మించి అనలిటిక్స్ కావాలి అనుకునే ఉన్నత శ్రేణి వ్యాపార సంస్థలకు పవర్ బీఐ మంచి ఎంపిక. ఇతర మేనేజ్‌మెంట్ టూల్స్ అయిన షేర్‌పాయింట్, ఆఫీస్ 365, డైనమిక్స్ 365 వంటివి వాటితో సులువుగా అనుసంధానమై పనిచేయగలదు. అలాగే మైక్రోసాఫ్ట్ ప్రొడక్ట్స్ కాకపోయినా స్పార్క్, హడూప్, గూగుల్ అనలిటిక్స్, ఎస్ఏపీ, సేల్స్‌ఫోర్స్ వంటి అప్లికేషన్లతోనూ కలిసి పనిచేయగలదు. దీని ద్వారా యూజర్‌కు అత్యంత అనుకూలమైన పని వాతావరణం ఉంటుంది.

పవర్ బీఐలో వివిధ భాగాలున్నాయి. అవి...

1. **క్వెరీ :** వివిధ వనరుల నుంచి డేటాను తీసుకోవడం, కలపడం, మెరుగుపరచడం చేస్తుంది.
2. **పెవెట్ :** డేటా మోడల్స్ తయారుచేయడానికి ఉపయోగపడుతుంది.
3. **వ్యూ :** చార్టులు, గ్రాఫ్స్, మ్యాప్స్, ఇతర విజువల్స్ తయారుచేస్తుంది.
4. **క్యూ అండ్ ఏ :** డేటా గురించి వివిధ ప్రశ్నలు అడిగేందుకు వీలు కల్పిస్తుంది.

సర్టిఫికేషన్లు..

పవర్ బీఐలో మైక్రోసాఫ్ట్ సంస్థ అందించే ప్రొఫెషనల్ సర్టిఫికెట్లు పొందడం ద్వారా జాబ్ మార్కెట్‌లో ముందంజ వేయొచ్చు. అయితే ఇందుకోసం తగిన పరీక్ష రాయాలి.

▲ ఐటీలో ఎంట్రీ లెవెల్ ఉద్యోగాలు పొందేందుకు ఎంసీఎస్ఏ మిడ్ లెవెల్, ఆపైన ప్రయత్నించేందుకు ఎంఎస్‌సీఈ సర్టిఫికేషన్లు ఉపయోగపడతాయి.

ఉద్యోగాలు...

పవర్ బీఐతో వివిధ రకాలైన ఆసక్తికర, లాభదాయకమైన ఉద్యోగాల్లోకి ప్రవేశించవచ్చు. అవి...

బీఐ ఆర్కిటెక్ట్ : వీరు డేటాబేస్, డేటా వేర్‌హౌస్, ఇతర స్టోరేజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లతో పనిచేస్తారు. వాటి సాయంతో డేటా స్ట్రక్చర్స్‌ను అభివృద్ధి చేస్తారు. డేటాను పూర్తిస్థాయిలో వాడుకునేలా తీర్చిదిద్దుతారు.

బిజినెస్ అనలిస్ట్ : ఇది కొంత సాంకేతిక, మరికొంత బిజినెస్ ఆధారిత ఉద్యోగం. ఈ నిపుణులకు వ్యాపార అవసరాలు తెలిసి ఉండటంతోపాటు, సమాచార నైపుణ్యాలు ఉండాలి. కొత్త బిజినెస్ ఇంటెలిజెన్స్ సొల్యూషన్స్‌ను తయారుచేయడం వీరి ప్రధాన లక్ష్యం. నివేదికల తయారీ తెలిసి ఉండాలి.

డేటా అనలిస్ట్ : వీరు రిపోర్టులు తయారుచేయడం, అనాలిసిస్‌ను ప్రయోజనకరమైన ఇన్‌సైట్స్‌గా రూపొందించడం, వ్యాపారానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దడం చేస్తారు.

బీఐ డెవలపర్ : ఇతర డెవలపర్స్ మాదిరిగానే బీఐ డెవలపర్లు టూల్స్, సొల్యూషన్స్‌ను తయారుచేస్తారు. వ్యాపార అవసరాలకు తగినట్టుగా అప్లికేషన్లను అభివృద్ధి చేసేందుకు తోడ్పడతారు.

నేర్చుకోవడం ఎలా?

ఆన్‌లైన్‌లో మైక్రోసాఫ్ట్ లెర్న్ ద్వారా దీని గురించి పూర్తిస్థాయిలో తెలుసుకోవచ్చు. సింప్లీలెర్న్, యుడెమీ, కోర్సెరా వంటి లెర్నింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో దీనికి సంబంధించిన వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో చేరి సులభంగా నేర్చుకునే వీలుంది. ఎంత గట్టి పట్టు సంపాదిస్తే అంతగా ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి!

నోటిఫికేషన్స్

ఉద్యోగాలు

హైదరాబాద్‌లో అకడమిక్ అసోసియేట్‌లు

హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీ రాజ్ కాంట్రాక్ట్ ప్రాతిపదికన 9 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- అకడమిక్ అసోసియేట్ (సీజీఏఆర్‌డీ): 4
- అకడమిక్ అసోసియేట్ (ఐటీ): 1
- అకడమిక్ అసోసియేట్ (సోషల్ ఆడిట్): 1
- రిసెర్చ్ అసోసియేట్ (సోషల్ ఆడిట్): 1
- జూనియర్ ఫెలో (సోషల్ ఆడిట్): 1
- రిసెర్చ్ అసోసియేట్ (ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ క్లైమేట్ చేంజ్): 01

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంఈ, ఎంటెక్, ఎంఎస్సీ, పీజీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.
దరఖాస్తు రుసుము: జనరల్/ ఓబీసీ/ ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు మినహాయింపు.
ఎంపిక: రాత పరీక్ష/ఇంటర్వ్యూ ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 01.09.2023.
వెబ్‌సైట్: http://nirdpr.org.in/

యూఐఐసీలో డాక్టర్, ఇంజినీర్ పోస్టులు

చెన్నైలోని యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ 100 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (స్కేల్ 1) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- లీగల్ స్పెషలిస్ట్: 25
- అకౌంట్స్/ ఫైనాన్స్ స్పెషలిస్ట్: 24
- కంపెనీ స్పెషలిస్ట్: 3
- యాక్చువరీలు: 3
- డాక్టర్: 20
- ఇంజినీర్: 22
- అగ్రికల్చర్ స్పెషలిస్ట్: 3

అర్హత: సంబంధిత విభాగంలో సీఏ, డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.
వయసు: 23-08-2023 నాటికి 21- 30 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: డాక్టర్ పోస్టులను ఇంటర్వ్యూ ఆధారంగా, మిగిలిన ఖాళీలను ఆన్‌లైన్ పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
దరఖాస్తు రుసుము: రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.250.
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ: 14-09-2023.
వెబ్‌సైట్: https://uiic.co.in/

అరుణాచల్ ప్రదేశ్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ

నిర్జులి (అరుణాచల్ ప్రదేశ్)లోని నార్త్ ఈస్టర్న్ రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఎన్ఈఆర్ఐఎస్‌టీ) 28 గెస్ట్ ఫ్యాకల్టీ ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
విభాగాలు: ఈసీఈ, సివిల్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్, ఫారెస్ట్రీ, మ్యాథ్స్, ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, అగ్రికల్చరల్ ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్ స్టడీస్, ఫిజిక్స్.
అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్/ ఎంఈ/ ఎంటెక్/ ఎంఎస్సీ/ ఎంఏ/ ఎంఎస్/ పీహెచ్‌డీతో పాటు పని అనుభవం.
దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'రిజిస్ట్రార్, ఎన్ఈఆర్ఐఎస్‌టీ, నిర్జులి, అరుణాచల్ ప్రదేశ్' చిరునామాకు పంపించాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 30-08-2023
వెబ్‌సైట్: https://www.nerist.ac.in/

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో సైట్ ఇంజినీర్ పోస్టులు

హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తెలంగాణ స్టేట్ బ్రాంచ్ కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. ఇంటర్నల్ ఆడిటర్
2. సైట్ ఇంజినీర్

అర్హత: సీఏ, డిప్లొమా.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను 'జనరల్ సెక్రటరీ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, తెలంగాణ స్టేట్ బ్రాంచ్, స్ట్రీట్ నెం.15, హిమాయత్ నగర్, హైదరాబాద్' చిరునామాకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 30-08-2023.
వెబ్‌సైట్: https://redcross.cgg.gov.in/

ప్రవేశాలు

పార్ట్ టైమ్ ఎంటెక్, ఎంబీఏ

హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ 2023-24 విద్యా సంవత్సరానికి పార్ట్ టైమ్ పీజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఒక్కో ప్రోగ్రామ్‌లో 30 చొప్పున సీట్లున్నాయి.

- ఎంటెక్: ఎలక్ట్రికల్ పవర్ ఇంజినీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇండస్ట్రియల్ డ్రైవ్స్, ఇంజినీరింగ్ డిజైన్, థర్మల్ ఇంజినీరింగ్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్ సిస్టమ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, కంప్యూటర్ సైన్స్, ఇండస్ట్రియల్ మెటలర్జీ, బయో టెక్నాలజీ, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, వాటర్ రిసోర్సెస్ ఇంజినీరింగ్, రిమోట్ సెన్సింగ్ అండ్ జీఐఎస్,
- ఎంబీఏ (హెచ్ఆర్/ ఫైనాన్స్/ మార్కెటింగ్/ ఆంత్రప్రెన్యూర్‌షిప్)

అర్హత: డిగ్రీ/ బీఈ/ బీటెక్/ ఎంబీబీఎస్/ బీడీఎస్/ బీవీఎస్సీ/ బీఫార్మసీ/, ఎంసీఏ/ ఎంఎస్సీ
వ్యవధి: మూడేళ్లు
ఎంపిక: ప్రవేశ పరీక్ష ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.09.2023
రూ.1000 ఆలస్య రుసుముతో చివరి తేదీ: 27.09.2023.
వెబ్‌సైట్: https://jntuh.ac.in/

హోటల్ కన్సల్టెన్సీలో పీజీ డిప్లొమా

నోయిడాలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్ టెక్నాలజీ (ఎన్‌సీహెచ్ఎంసీటీ) 2023-24 విద్యా సంవత్సరానికి పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ హోటల్ కన్సల్టెన్సీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.
వ్యవధి: సంవత్సరం.
మొత్తం సీట్లు: 30.
అర్హత: డిగ్రీ (హాస్పిటాలిటీ/ కలినరీ ఆర్ట్). లేదా డిగ్రీతో పాటు హోటల్ ఇండస్ట్రీలో రెండేళ్ల పని అనుభవం. లేదా డిగ్రీతో పాటు డిప్లొమా/ పీజీ డిప్లొమా(హాస్పిటాలిటీ ట్రేడ్). లేదా పీజీ (హాస్పిటాలిటీ/ హోటల్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులై ఉండాలి.
వయసు: వయఃపరిమితి నిబంధనలు లేవు.
దరఖాస్తుకు చివరి తేదీ: 08-09-2023.
వెబ్‌సైట్: https://www.nchm.gov.in/

తాజా ఇంటర్న్‌షిప్‌లు

వర్క్ ఫ్రమ్ హోమ్

కంటెంట్ రైటింగ్ I

సంస్థ: మౌత్ అండ్ ఫుట్
స్టైపెండ్: నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 8
అర్హతలు: బ్లాగింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడంలో నైపుణ్యం
internshala.com/i/a6261f

2

సంస్థ: గోసిన్‌క్యూ ట్రైనింగ్స్
ప్రదేశం: హైదరాబాద్
స్టైపెండ్: నెలకు రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 6
అర్హతలు: బ్లాగింగ్, కంటెంట్ రైటింగ్, కాపీ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడంలో నైపుణ్యం
internshala.com/i/247cbd

ఆర్కిటెక్చర్

సంస్థ: ఆదర్శ్ సింగ్
స్టైపెండ్: నెలకు రూ.7,000-10,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 7
అర్హతలు: అడోబ్ ఇన్‌డిజైన్, ఆటోక్యాడ్, గూగుల్ స్కెచప్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్ పాయింట్ నైపుణ్యాలు
internshala.com/i/6800f0

డిజిటల్ మార్కెటింగ్

సంస్థ: సెలిబ్రేర్
స్టైపెండ్: నెలకు రూ.8,000-14,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 7
అర్హతలు: డిజిటల్ మార్కెటింగ్, ఫేస్‌బుక్ యాడ్స్, సెర్చ్ ఇంజిన్ మార్కెటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/d82833

బిజినెస్ డెవలప్‌మెంట్ (పీపుల్ పార్టనర్‌షిప్స్)

సంస్థ: హ్యాపీమైండ్
స్టైపెండ్: నెలకు రూ.1,000-2,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 7
అర్హతలు: బిజినెస్ డెవలప్‌మెంట్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
internshala.com/i/e7e109

హైదరాబాద్‌లో

సినిమాటోగ్రఫీ అండ్ ఎడిటింగ్

సంస్థ: గోసిన్‌క్యూ ట్రైనింగ్స్
స్టైపెండ్: నెలకు రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 7
అర్హతలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, ఫొటోషాప్, ఫొటోషాప్ లైట్‌రూమ్ సీసీ, ప్రీమియర్ ప్రో, డిజిటల్, డిస్‌ప్లే అడ్వర్టైజింగ్, వీడియో ఎడిటింగ్ వీడియో మేకింగ్ నైపుణ్యాలు
internshala.com/i/8b5b7d

లా/లీగల్

సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్
స్టైపెండ్: నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 7
అర్హతలు: క్లయింట్ రిలేషన్‌షిప్, కంటెంట్ రైటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, లేబర్ లాస్, ఎంఎస్-ఆఫీస్, ఎంఎస్-వర్డ్, రిసెర్చ్ అండ్ ఎనలిటిక్స్ నైపుణ్యాలు
internshala.com/i/170c22

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: ఈస్ట్రా ఓవర్‌సీస్
స్టైపెండ్: నెలకు రూ.10,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 6
అర్హతలు: సేల్స్ పిచ్ నైపుణ్యం
internshala.com/i/3dcbc2

3డి డిజైన్

సంస్థ: హూజింక్ ఆర్ట్ అండ్ డిజైన్ స్టూడియో స్టైపెండ్: నెలకు రూ.15,000 దరఖాస్తు గడువు: సెప్టెంబరు 6 అర్హతలు: 3డీస్ మ్యాక్స్, బ్లెండర్ 3డీ, క్యాడ్, రైనో నైపుణ్యాలు
internshala.com/i/6122bf

ఫండ్ రైజింగ్

సంస్థ: యానిమల్ వారియర్స్ కన్జర్వేషన్ సొసైటీ స్టైపెండ్: నెలకు రూ.10,000 దరఖాస్తు గడువు: సెప్టెంబరు 6 అర్హతలు: ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్ నైపుణ్యాలు
internshala.com/i/6663e9

ఏవియేషన్ డేటా ఎనాలిసిస్

సంస్థ: జీగ్లర్ ఏరోస్పేస్
స్టైపెండ్: నెలకు రూ.8,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 7
అర్హతలు: డేటా అనలిటిక్స్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎస్టిమేషన్ (ఎస్టిమేటింగ్) ఫైనాన్షియల్ లిటరసీ, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్, టైమ్ మేనేజ్‌మెంట్ నైపుణ్యాలు
internshala.com/i/6a26fe

ఫీల్డ్ సేల్స్

సంస్థ: అట్రియ కన్వర్జెన్స్ టెక్నాలజీస్
స్టైపెండ్: నెలకు రూ.13,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 4
అర్హతలు: సేల్స్ నైపుణ్యం
internshala.com/i/d3bc77

బిజినెస్ డెవలప్‌మెంట్

సంస్థ: ఎమోటికాన్ స్టైపెండ్: నెలకు రూ.7,000-12,000 దరఖాస్తు గడువు: సెప్టెంబరు 4 అర్హతలు: క్లయింట్ రిలేషన్‌షిప్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్ నైపుణ్యాలు
internshala.com/i/f17864

టెలికాలింగ్

సంస్థ: హమ్‌వీ టెక్ స్టైపెండ్: నెలకు రూ.10,000-15,000 దరఖాస్తు గడువు: సెప్టెంబరు 5 అర్హతలు: టెలికాలింగ్ నైపుణ్యం, ఆసక్తి ఉన్న విద్యార్థులు
internshala.com/i/02e859

ఇస్లామిక్ స్టడీస్‌తో..

ఎంఏ ఇస్లామిక్ స్టడీస్ పూర్తి చేశాను. ఈ కోర్సుతో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఏ ఉద్యోగ అవకాశాలు ఉంటాయి? - అల్తాఫ్

■ ఎంఏ ఇస్లామిక్ స్టడీస్ చదివితే ఇస్లామిక్ ట్రాన్స్‌లేటర్, ఇస్లామిక్ జర్నలిస్టు అవొచ్చు. బీఈడీ చేసి ఇస్లామిక్ టీచర్లుగా, పీహెచ్‌డీ చేసి ఇస్లామిక్ అధ్యాపకులుగా, ఇస్లామిక్ పరిశోధకులుగా, ఇస్లామిక్ కంటెంట్ రైటర్లుగా, ఇస్లాం మత ప్రచారకులుగా, క్యాలిగ్రాఫర్లుగా ఉద్యోగాలు చేయవచ్చు. ఇవేకాకుండా స్వచ్ఛంద సేవా సంస్థల్లో, వ్యాపార సంస్థల్లో, ఇంటర్నేషనల్ రిలేషన్స్ ఆఫీసుల్లో, డిఫెన్స్, సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్లలో కొలువుల్లో చేరే అవకాశం ఉంది. వీటితో పాటు డిగ్రీ అర్హత ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలకు కూడా ప్రయత్నించవచ్చు. – ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

చేరిన కోర్సులో ఇమడలేకపోతే?

ఎంబీబీఎస్ కొందరు విద్యార్థుల లక్ష్యం. ఐఐటీలో ఇంజినీరింగ్ చదవటమో, రక్షణ దళాల్లో చేరటమో ఇంకొందరి ఆశయం. అయితే సంబంధిత పోటీ పరీక్షల్లో కొందరే నెగ్గి సీట్లు తెచ్చుకోగలుగుతారు. మిగిలిన వారిలో కొంతమంది అనుకున్నది సాధించలేక.. ప్రత్యామ్నాయమూ సిద్ధంగా లేక ఇబ్బందిపడుతుంటారు.

ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు గట్టిగా ప్రయత్నించడం వరకూ బాగానే ఉంటుంది. కానీ దాన్ని సాధించలేకపోయినప్పుడు మాత్రం కొందరు విపరీతమైన నిరాశానిస్పృహలకు లోనవుతుంటారు. ఇక ఏమీ సాధించలేమనే నిర్ణయానికి వచ్చేస్తుంటారు. అలాకాకుండా ఉండాలంటే ప్రత్యామ్నాయ ప్రణాళిక ఉండాలి.

అన్నీ మనం అనుకున్నట్టుగానే జరగాలని ఆశపడటంలో తప్పు లేదు. కానీ కొన్నిసార్లు అనుకోని అవాంతరాలూ, అనారోగ్య సమస్యలూ ఎదురవుతుంటాయి. దాంతో వ్యతిరేక ఫలితాలు వస్తుంటాయి. అలాంటప్పుడు తట్టుకుని ధైర్యంగా నిలబడగలగాలంటే మీ దగ్గర ప్లాన్-ఎతో పాటు ప్లాన్-బి కూడా పెట్టుకోవాలి.

ఆలస్యంగా తెలిసొస్తే...?

ఒక్కోసారి ఏమవుతుందంటే.. ముందుగా అనుకున్నట్టుగానే కోరుకున్న కోర్సులోనే చేరతారు. కానీ కొన్ని రోజులకే మీ ఎంపిక సరైంది కాదని తెలిసిపోతుంది.

నిపుణులైన అధ్యాపకులు లేకపోవడం లేదా మీరు ఎంచుకున్న కోర్సుకు భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు లేకపోవచ్చని ఆలస్యంగా తెలిసిరావడం.. ఇలా రకరకాల కారణాలతో మీ నిర్ణయం సరైంది కాదని తెలుస్తుంది. స్నేహితులు/ కుటుంబసభ్యుల ఒత్తిడికి గురై కోర్సును ఎంచుకుని నచ్చక మధ్యలో మానేసేవాళ్లూ ఉంటారు. లేదా డిగ్రీలో చేరి ఎలాగోలా కొనసాగించాలని ఆలోచించేవాళ్లూ ఉంటారు. పదో తరగతి, ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు సాధారణంగా ఇలాంటి పరిస్థితి ఎదురవుతుంది. ఇతరుల ప్రభావానికి లోనై నిర్ణయాలు తీసుకుంటే.. కోర్సు మొదలైన కొన్ని రోజులకే నిర్ణయం సరికాదనే విషయం తెలిసిపోతుంది.

అలాంటప్పుడు ఇలా చేయొచ్చు...

- అదే కోర్సులో కొనసాగుతూ డిగ్రీ పూర్తి చేయడానికే ప్రయత్నించాలి. ఈ అర్హతతో ప్రభుత్వ పోటీ పరీక్షలకూ సిద్ధంకావచ్చు. లేదా ఏదైనా ఉద్యోగంలోనూ చేరొచ్చు. ఈ అర్హతే పునాదిగా ఉన్నత విద్యకూ వెళ్లొచ్చు. ఈసారి నిర్ణయ లోపం లేకుండా మీకిష్టమైన సబ్జెక్టులనే ఎంచుకుని పీజీ పూర్తిచేయొచ్చు.
- ఒకపక్క చదువును కొనసాగిస్తూనే ప్రవేశ పరీక్ష రాయడానికి శిక్షణ తీసుకోవచ్చు. మంచి మార్కులు వస్తే కోరుకున్న కాలేజీలో, కోర్సులో చేరిపోవచ్చు. ఈసారి కూడా తక్కువ మార్కులే వస్తే ప్రవేశ పరీక్షను పక్కన పెట్టి.. సాధారణ డిగ్రీ పూర్తి చేయొచ్చు.

అవసరమైతే విరామం

మరో అవకాశమూ ఉంది. సంవత్సరంపాటు విరామం తీసుకుని.. ఇష్టమైన రంగంలో పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి ప్రయత్నించాలి. ఈ వ్యవధిలో ఇంటర్న్‌షిప్‌లూ చేయొచ్చు. లేదా ఆసక్తిని బట్టి ఆన్‌లైన్ కోర్సులూ చదవొచ్చు. తర్వాతి ఏడాది మీకిష్టమైన కోర్సులో చేరడానికి ఇవి ఉపయోగపడొచ్చు. అయితే ఈ ఏడాది సమయాన్ని ఏ మాత్రం వృథా చేయకూడదు. కోరుకున్న కాలేజీ, కోర్సులో సీటు సాధించడానికి అవసరమైన పరిజ్ఞానాన్ని సంపాదించడానికే వినియోగించాలి. కావాలనే విరామం తీసుకున్నారు కాబట్టి.. చాలా సమయం అందుబాటులో ఉంటుంది. దాన్ని స్మార్ట్ ఫోన్లతో గడపడానికీ, స్నేహితులతో షికార్లకూ దుర్వినియోగం చేయకూడదు.

మీ దీర్ఘకాలిక లక్ష్యాల సాధనకు.. ప్రస్తుతం మీరు ఎంచుకున్న కోర్సు పునాది కావాలి. నిర్ణయం తీసుకునే ముందు.. గతంలో సంపాదించిన మార్కులు, ఆసక్తిని మాత్రమే పరిగణనలోకి తీసుకోకూడదు. కోర్సుకు ఉండే ఉద్యోగావకాశాలు, వేగంగా నిర్ణయాలు తీసుకోవడానికి, ఇతర నైపుణ్యాల అభివృద్ధికి ఈ కోర్సు ఎలా ఉపయోగపడగలదో తెలుసుకోవాలి.

నిర్ణయాలను సరిదిద్దుకోవచ్చు

జాగ్రత్తగా ఆలోచించి.. అడుగులు వేస్తే పొరపాటు నిర్ణయాలను కూడా సరిదిద్దుకోవచ్చు. ప్రస్తుతం టెక్నాలజీ, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్, సోషల్ సైన్సెస్ మొదలైన రంగాల్లో విభిన్నమైన కాంబినేషన్లలో కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. మీ ఆసక్తి, శక్తిసామర్థ్యాలను దృష్టిలో ఉంచుకుని తగిన కోర్సును ఎంచుకోవాలి.

ఇక్కడో విషయాన్ని గుర్తుంచుకోవాలి. పొరపాటు నిర్ణయం అనేది ఎప్పుడూ మీ కలలను అంతం చేయకూడదు. మీరు కుంగుబాటుకు గురయ్యేలానూ చేయకూడదు. మొదట్లో పొరపాటు జరిగినా.. ప్రత్యామ్నాల మార్గాల గురించి ఆలోచించి దాన్ని సరిదిద్దుకునేలా నిర్ణయం తీసుకోవాలి.